
సాక్షి
మెదక్
శుక్రవారం । 29 । డిసెంబర్ । 2023

కొడిపల్లిలో జాతీయ రహదారిని కమ్మేసిన పొగమంచు



కమ్మేసిన పొగమంచు

మండల కేంద్రమైన కొడిపల్లితో పాటు పలు గ్రామాలలో గురువారం ఉదయం పొగమంచు కమ్మేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఉదయం తొమ్మిది దాటినా మంచు వీడలేదు. దీంతో 765డి జాతీయ రహదారిపై వాహనదారులు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొడిపల్లి (నర్సాపూర్)

న్యూస్‌రీల్

భూ కేటాయింపునకు చర్యలు

ఎమ్మెల్యే సునీతారెడ్డి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, ఆర్యవైశ్య సంఘం నాయకులు

నర్సాపూర్: నర్సాపూర్ ఆర్యవైశ్య భవనం నిర్మాణానికి భూమిని కేటాయించేందుకు చర్యలు తీసుకుంటానని స్థానిక ఎమ్మెల్యే సునీతారెడ్డి స్పష్టం చేశారు. గురువారం స్థానిక రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఆర్యవైశ్య సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గత ప్రభుత్వం ఆర్యవైశ్య సంఘం భవన నిర్మాణానికి నిధులు కేటాయించిందని, ఆ నిధులు విడుదల చేయించేందుకు కృషి చేస్తానని చెప్పారు. పట్టణంలో నిర్మిస్తున్న శ్రీకన్యకాపరమేశ్వరీ మాత ఆలయ నిర్మాణానికి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి మల్లేశ్, కోశాధికారి హరీశ్, నోముల పాండు, వెంకటేశం, బుచ్చయ్య, వెంకన్న, శ్రీనివాస్, మహేశ్, వెంకటేశ్, భిక్షపతి పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో భూ సమస్య పరిష్కారం

జూనియర్ సివిల్ జడ్జి అనిత



భూ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను చూపుతున్న రైతులు

నర్సాపూర్: ఎంతో కాలంగా అపరిష్కృతంగా ఉన్న భూ వివాదాన్ని పరిష్కరించినట్లు స్థానిక కోర్టు జూనియర్ సివిల్ జడ్జి కె.అనిత చెప్పారు. మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో ఆమె పాల్గొన్నారు. మండలంలోని గూడెంగడ్డకు చెందిన మన్నె చంద్రయ్య, మన్నె సత్తమ్మల కుమారులు మన్నె శ్రీశైలం, మన్నె మహేందర్, మన్నె నవీన్‌ల భూ వివాదం తలెత్తిందని, వారిలో కొందరు మండల లీగల్ సర్వీస్ కమిటీని ఆశ్రయించారని ఆమె చెప్పారు. దీంతో వారితో మాట్లాడి సమస్యను పరిష్కరించామని, వారి భూములను రిజిస్ట్రేషన్ చేయించి డాక్యుమెంట్లు కూడా అందజేశామని కె.అనిత తెలిపారు. న్యాయవాదులు శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్, లీగల్ సర్వీస్ కమిటీ సిబ్బంది పాల్గొన్నారు.

జీతాలిస్తేనే విధులు

నర్సాపూర్: తమ జీతాల బకాయిలు చెల్లించే వరకూ విధులకు హాజరవ్వబోమని పలువురు రెవెన్యూ డిపార్టుమెంటు ఉద్యోగులు స్పష్టం చేశారు. ఈ విషయంపై ఉద్యోగులు రమేశ్ కుమార్, ప్రవీణ్ కుమార్, సవిత, శిరీష, రాజు తదితరులు గురువారం స్థానిక ఆర్డీఓ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ తమకు ఐదు నెలలుగా జీతాలు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఎంప్లాయి ఐడీతో పాటు వేతనాలు ఇచ్చేంత వరకు విధులకు వెళ్లలేమని చెప్పారు.

మాదిగ సంఘం కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సంఘం సభ్యులు

రామాయంపేట(మెదక్): తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం ఆరో వార్షికోత్సవానికి సంబంధించిన కరపత్రాలను దంతేపల్లిలో సంఘం సభ్యులు గురువారం ఆవిష్కరించారు. ఆ సంఘం జిల్లా కార్యదర్శి కీసరి సిద్దరాంలు మాట్లాడుతూ వచ్చే నెల మూడున హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమంలో సంఘం, దాని అనుబంధ సంఘాల సభ్యులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కీసరి స్వామి, రమేశ్, గోపాల్, సాయిలు, చింటూ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం



రాకేశ్(ఫైల్)

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని చల్మెడ గ్రామానికి చెందిన యువకుడు అదృశ్యమైనట్టు ఎస్‌ఐ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన తుమ్మల కిషన్ కుమారుడు రాకేశ్ బుధవారం మధ్యాహ్నం నిజాంపేట వెళుతున్నానని చెప్పి తన బైక్ తీసుకొని ఇంట్లో నుంచి వెళ్లాడు. అయితే గురువారం ఉదయం వరకు తిరిగి రాకపోవడంతో రాకేశ్ తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే తమకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

నమ్మకాన్ని వమ్ము చేయం

డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్

నర్సాపూర్: కాంగ్రెస్ పార్టీ హామీ ఇస్తే నెరవేరుస్తుందని పేద ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయమని డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆవుల రాజిరెడ్డి క్యాంపు కార్యాలయంలో గురువారం ఆ పార్టీ జెండాను ఆంజనేయులుగౌడ్ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఆరు గ్యారంటీల అమలుకు సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు చేపట్టారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జ్యోతి, నాయకులు రిజ్వాన్, సుహాసినీరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, శివకుమార్, మహేశ్‌రెడ్డి, సుదర్శన్‌గౌడ్, రాధాకిషన్‌గౌడ్, రషీద్, అశోక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల వద్దకు ప్రభుత్వం

- ఐదు పథకాలకు ఒకే దరఖాస్తు
- ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలి
- మంత్రి దామోదర రాజనర్సింహ
- విజయవంతం చేయాలి: కలెక్టర్



రేగోడ్: జ్యోతి వెలిగిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ, చిత్రంలో కలెక్టర్ రాజర్షిషా

రేగోడ్(మెదక్): ఐదు గ్యారంటీల అమలు.. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజల వద్దకు ప్రభుత్వం వస్తోందని వైద్య ఆరోగ్యశాఖ, సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. మండలంలోని టి.లింగంపల్లి గ్రామంలో గురువారం సాయంత్రం జరిగిన ప్రజాపాలన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఆయన కలెక్టర్ రాజర్షిషాతో కలిసి జ్యోతి వెలిగించారు. అనంతరం లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం దామోదర మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ ఏ ప్రభుతమూ ప్రజల వద్దకు రాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమే ప్రజల వద్దకు వస్తోందని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం గ్యారంటీల్లో ఒకటైన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేశామన్నారు. పేదవాడి ఆరోగ్య సంరక్షణ కోసం రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.10 లక్షలకు పెంచామని తెలిపారు. విడతల వారిగా మిగతా గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పారు.

విజయవంతం చేయాలి: కలెక్టర్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. ప్రజాపాలన గ్రామసభల్లో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ సురేశ్, షెట్కార్, పీసీసీ సభ్యుడు మున్నూరు కిషన్, జెడ్పీటీసీ యాదగిరి, ఎంపీపీ సరోజన, కో ఆప్షన్ సభ్యుడు చోటుమియా, దిగంబరరావు, ఆర్డీఓ సాయిబాబా, తహసీల్దార్ బాల లక్ష్మి, ఎంపీడీఓ సీతారావమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఐదు గ్యారంటీ పథకాలకు ఒకే దరఖాస్తు

అల్లాదుర్గం(మెదక్): ప్రజల వద్దకే సంక్షేమ పథకాలు అందించాలనే ఉద్దేశ్యంతో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మంత్రి తెలిపారు. గురువారం అల్లాదుర్గం మండలం రాంపూర్ గ్రామంలో ప్రజా పాలన కార్యక్రమంలో పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల ఆశీస్సులతోనే ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ ఐదు గ్యారంటీలకు ఒకే దరఖాస్తు చేసుకోవాలని, ప్రజా పాలన కార్యక్రమంలో అర్జీలు పెట్టుకోని వారు జనవరి 6 వరకు పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఒక్కో కౌంటర్‌లో వంద మంది దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి చందునాయక్, డీపీఓ సాయిబాబా, సర్పంచ్ భూలక్ష్మి, జెడ్పీటీసీ సౌందర్య, ఎంపీడీఓ శంకర్, తహసీల్దార్ సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

టేక్మాల్‌ను సంగారెడ్డిలో కలపాలి

టేక్మాల్ మండలాన్ని సంగారెడ్డి జిల్లాలో కలపాలని, మెదక్ జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నిమ్మ రమేశ్ ఆధ్వర్యంలో పలువురు నేతలు మంత్రి దామోదర రాజనర్సింహకు వినతి పత్రాన్ని అందించారు. అన్ని అంశాలపై పూర్తిగా స్టడీచేసి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ రాజర్షిషా, డీపీఓ సాయిబాబు, జిల్లా వైద్యాధికారి చందునాయక్, జెడ్పీటీసీ సరోజ, వైస్‌ఎంపీపీ మంజుల రాజుగౌడ్, ఎంపీటీసీ రాంబాయి నర్సింలు, జిల్లా కో–ఆప్షన్ సభ్యులు యూసూఫ్, తహశీల్దార్ క్రిష్ణ, ఎంపీడీఓ రియాజొద్దీన్, సర్పంచ్ గోపాల్, మాజీ సర్పంచ్ బాలకృష్ణ, మాన్ కిషన్, విష్ణువర్ధన్‌రెడ్డి, మల్లారెడ్డి, సత్యనారాయణ, సంగమేశ్వర్‌గౌడ్, మజహర్, కిషోర్, మహేష్‌రెడ్డి, మొగులయ్య, సాగర్, అనిల్, భరత్, యాదయ్య తదితరులు ఉన్నారు.

చల్లపల్లిలో...

టేక్మాల్(మెదక్): చల్లపల్లి గ్రామంలో ప్రజా పాలన కార్యక్రమాన్ని మంత్రి దామోదర ప్రారంభించారు. మహిళల నుంచి దరఖాస్తులను తీసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ సంక్షేమ పథకాల కోసం అందరూ దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రజల కష్టాలు తీర్చి కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేస్తుందని, వైద్యపరంగా మండలాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు.

పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకోవాలి

అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

కొడిపల్లి(నర్సాపూర్): ప్రజాపాలనలో పథకాల కోసం లబ్ధిదారులు తమ పూర్తి వివరాలతో దరఖాస్తులు చేసుకోవాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం కొడిపల్లి మండలం భుజిరంపేటలో గ్రామసభలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ జనవరి 6 వరకు గ్రామసభలు కొనసాగుతాయని చెప్పారు. కౌంటర్ల వద్ద అన్నిశాఖల అధికారులు అందుబాటులో ఉంటారని, అర్హులందరూ ఫాంలు నింపి ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు జిరాక్స్ పత్రాలు జతచేసి అందజేయాలన్నారు. జనరల్ కౌంటర్‌లో ఇతర సమస్యలపై దరఖాస్తు చేయవచ్చని తెలిపారు. అలాగే బూరుగడ్డ, ధర్మాసాగర్ గ్రామసభలో డీఈఓ, మండల ప్రత్యేకాధికారి రాధాకిషన్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, తహసీల్దార్ ఆంజనేయులు, సర్పంచ్‌లు వనజ, అంజమ్మ, ఆశమ్మ, ప్రమీల, ఎంపీటీసీలు నాయికోటి సత్తయ్య, జ్యోతి రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన పరిశీలన

హవేళిఘణాపూర్(మెదక్): మెదక్, హవేళి ఘణాపూర్ మండలాల్లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా అధికారులు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మెదక్ మండల పరిధిలోని రాయిన్‌పల్లి గ్రామంలో అదనపు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు కార్యక్రమ నిర్వహణ తీరును పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బంది కలుగకుండా చూడాలి – జడ్పీ సీఈఓ శైలేశ్

మనోహరాబాద్(తూప్రాన్): ప్రతి ఒక్కరి దరఖాస్తును స్వీకరించి ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చూడాలని జడ్పీ సీఈఓ శైలేశ్ అధికారులకు సూచించారు. మండలంలోని చెట్లగౌరారం ప్రజాపాలన కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి సూచనలు చేశారు. దండుపల్లి, పోతారం, కొండాపూర్ గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించారు. కొండాపూర్‌లో 133, దండుపల్లిలో 76, చెట్లగౌరారంలో 65, పోతారంలో 12 దరఖాస్తులు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ప్రత్యేక అధికారి నర్సింలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలతో ఇందిరమ్మ రాజ్యం

ఎమ్మెల్యే రోహిత్



పాపన్నపేట(మెదక్): కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

పాపన్నపేట(మెదక్): ఆరు గ్యారంటీలతో ఇందిరమ్మ రాజ్యం తథ్యమని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. ఎల్లాపూర్‌లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ఆయన కలెక్టర్ రాజర్షిషాతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోకు అనుకూలంగా పాలన చేపడుతామన్నారు. అర్హులందరికీ పథకాలు అందేలా చూడాలని అధికారులను కోరారు. గ్రామంలోని ఏడుగురికి కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఎనిమిది రోజుల పాటు దరఖాస్తులు స్వీకరిస్తామని జిల్లా కలెక్టర్ రాజర్షిషా చెప్పారు. మేజర్ పంచాయతీలలో రేపటి నుంచి ప్రతి రోజు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. రైతు భరోసా కింద భూమిహక్కు పత్రాలతో పాటు బ్యాంకు, ఆధార్‌కార్డు, రేషన్ కార్డులు పరిశీలించిన తర్వాత పథకాలు అందేలా చూస్తామన్నారు. ఎంపీపీ చందనాప్రశాంత్‌రెడ్డి, ప్రత్యేక అధికారి సతీశ్‌కుమార్, తహశీల్దార్ లక్ష్మణ్‌బాబు, సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ త్యార్ల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే సునీతారెడ్డి



ప్రొటోకాల్ పాటించలేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

వెల్దుర్తి(తూప్రాన్): అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించేందుకు నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి సూచించారు. గురువారం ఉమ్మడి వెల్దుర్తి మండలంలోని మానెపల్లి, అందుగులపల్లి, హస్తాల్‌పూర్, మెల్లూర్, హకింపేట, అచ్చంపేట, కొప్పులపల్లి, నాగ్సాన్‌పల్లి గ్రామాల్లో అధికారులు ప్రజాపాలన చేపట్టగా మానెపల్లిలో జరిగిన కార్యక్రమాన్ని వారు సందర్శించారు. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించడానికి ఏర్పాటు చేసిన కౌంటర్‌లను పరిశీలించారు. అనంతరం ప్రొటోకాల్‌పై వివాదం ఏర్పడింది. ఆమె అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు మహేశ్‌రెడ్డి, జిల్లా నాయకులు నరేందర్‌రెడ్డి, మల్లేశం, సుధాకర్‌గౌడ్, నర్సింహారెడ్డి, పోతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ జయచంద్రారెడ్డి, తహసీల్దార్ తులసీరాం, ఎంపీపీ స్వరూపరెడ్డి, సర్పంచ్ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

కోర్టుకు హాజరైన డీపీవో, శివ్వంపేట్ పీఎస్

సాక్షి, హైదరాబాద్: అనుమతి లేకుండా ఫ్యాక్టరీ నిర్మాణం, అనధికారికంగా మంజీరా నీటి వినియోగిస్తున్నారంటూ దాఖలైన పిటిషన్‌లో మెదక్ జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో), శివ్వంపేట్ పంచాయతీ సెక్రటరీ(పీఎస్) హైకోర్టు ఎదుట హాజరయ్యారు. గత విచారణ సందర్భంగా న్యాయస్థానం ముందు హాజరై వివరణ ఇవ్వాలని న్యాయస్థానం ఆదేశించిన విషయం తెలిసిందే. అన్ని అంశాలతో నివేదిక అందజేస్తామని రెండు వారాల సమయం కావాలని స్కోల్ బ్రూవరీస్ లిమిటెడ్ తరఫు న్యాయవాది కోరడంతో విచారణను వాయిదా వేసింది. శివ్వంపేట్‌లోని సర్వే నంబర్ 201, 203, 220, 221, 222, 226, 227, 228లో స్కోల్ బ్రూవరీస్ లిమిటెడ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేసి అనధికారికంగా మంజీరా నీటిని వినియోగించుకుంటోందని, అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టిన సంస్థపై చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ మెదక్ జిల్లా పుల్కల్ మండలం శివ్వంపేట్‌కు చెందిన కె.మల్లికార్జున గౌడ్‌తో పాటు మరి కొందరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పంచాయతీరాజ్ చట్టాన్ని ఉల్లంఘించి సంస్థ వ్యవహరిస్తున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం గురువారం మరోసారి విచారణ చేపట్టింది.

పకడ్బందీగా ఆపరేషన్ స్మైల్–ఎక్స్

అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్



మాట్లాడుతున్న అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్

మెదక్ మున్సిపాలిటీ: ఆపరేషన్ స్మైల్–ఎక్స్ పకడ్బందీగా నిర్వహించాలని అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్ అధికారులను ఆదేశించారు. నిర్వహణపై ఉమెన్ సేఫ్టీవింగ్ అడిషనల్ డీజీపీ పద్మజ గురువారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల పోలీసు ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మెదక్ నుంచి మహేందర్ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జనవరి 1 నుంచి 31 వరకు ఆపరేషన్ స్మైల్–ఎక్స్ నిర్వహించనున్నట్టు చెప్పారు. ఒక్కొక్క డివిజన్‌కు ఒక్క ఎస్‌ఐ నలుగురు సిబ్బందిని నియమించామని, వారంతా జిల్లాలో తప్పిపోయిన బాలురు, బాలికలు, చైల్డ్ లేబర్‌ను గుర్తించి వారి బంధువులకు అప్పగిస్తారన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రజలందరూ సహకరించాలని, బాల కార్మికుల సమాచారం తెలిస్తే 100, లేదా మెదక్ జిల్లా పోలీసు కంట్రోల్ రూమ్ నంబర్ 87126 5888కు సమాచారం అందించాలని సూచించారు.

మహిళా సాధికారతే లక్ష్యం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సంతోషి

పెద్దశంకరంపేట(మెదక్): మహిళా సాధికారతే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు మెదక్ మిషన్ శక్తి మహిళా సాధికారిక కేంద్రం, మహిళా శిశుసంక్షేమశాఖ జిల్లా కో ఆర్డినేటర్ సంతోషి అన్నారు. గురువారం బేటీ బచావో– బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో మాట్లాడారు. మహిళలు, విద్యార్థినులు ధైర్యంగా ఉండాలని, అత్యవసర సమయాల్లో హెల్ప్‌లైన్ 181, 1098, 100 టోల్‌ఫ్రీ నంబర్‌లకు కాల్ చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అవనీశ్‌రెడ్డి, లెక్చరర్లు పాల్గొన్నారు.

బడికి విద్యుత్ భారం

- రూ.వెయ్యి నుంచి 1500 బిల్లులు
- నిర్వహణకు ఇబ్బందులు
- ఉచిత విద్యుత్‌తో ఎంతో మేలు



హవేళీఘణాపూర్ మండలం కూచన్‌పల్లి ఉన్నత పాఠశాల

మెదక్: తమ పార్టీ అధికారంలోకి రాగానే పేదలకు ఉపయోగపడే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ నేతలు హామీలిచ్చారు. అలాగే గృహ అవసరాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అందిస్తామని చెప్పిన విషయం తెలిసిందే. అయితే పేద పిల్లలు చదివే సర్కార్ బడులకు కూడా ఉచిత విద్యుత్ అందిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పలువురు కోరుతున్నారు. కార్పొరేట్‌కు దీటుగా సర్కారీ బడుల్లో చదువు అందించాలంటే డిజిటలైజేషన్ అవసరం.. దానికి విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో పాఠశాలలకు ఉచిత విద్యుత్ అందిస్తే మరింత వేగంగా ప్రభుత్వ లక్ష్యానికి చేరవయ్యే అవకాశం ఉంటుంది.

మెదక్ జిల్లాలో మొత్తం 897 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వాటి పరిధిలో 84 వేలకు పైగా చిన్నారులు చదువుకుంటున్నారు. అన్ని పాఠశాలలకు విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. అయితే పాఠశాలలకు ఏడాదికి ఒకమారు విడుదలయ్యే నిర్వహణ బిల్లుల నుంచి సగం విద్యుత్ బిల్లులు చెల్లించేందుకే సరిపోతోంది. ఇతర ఖర్చులకు డబ్బులు సరిపడని పరిస్థితి నెలకొందని ఉపాధ్యాయులు వాపోయిన సందర్భాలు చాలా ఉన్నాయి. ఈ ప్రభుత్వమైనా పాఠశాలలకు ఉచిత విద్యుత్తు అందిస్తే కొంత ఊరట ఉంటుందని తద్వారా విద్యార్థులకు ఉపయోగపడుతుందని విద్యావేత్తలు అభిప్రాయ పడుతున్నారు.


పాఠశాలల డిజిటలైజేషన్

అన్ని ప్రభుత్వ బడుల్లో బోరుబావులు, ఫ్యాన్లు, కంప్యూటర్లతో పాటు ఇతర అవసరాలకు విద్యుత్‌ను వినియోగిస్తున్నారు. గతేడాది మన ఊరు మనబడి పథకంలో భాగంగా జిల్లాలో మొదటి విడతలో మూడు వందల పైగా స్కూళ్లను ఎంపిక చేశారు. వాటిలో కొన్ని పాఠశాలల నిర్మాణాలు పూర్తికావడం, మరికొన్ని మరమ్మతులు పూర్తయిన బడులకు విద్యాశాఖ కంప్యూటర్లు, స్కానర్లు, డిజిటల్ బోర్డుల పంపిణీ చేసింది. ఇప్పటి వరకు జిల్లాలో 120 పాఠశాలలకు ఆయా పరికరాలను పంపిణీ చేశారు. వాటిలో బ్లాక్ బోర్డులకు బదులు డిజిటలేజేషన్ బోర్డులను అందించారు. వాటిపై రాయడంతో పాటు పాఠాలు కూడా వినేందుకు వీలు ఉంటుంది. ఇలాంటి వాటికి తప్పని సరిగా విద్యుత్ అవసరం ఉంటుంది.

కేటగిరి 7లో బిల్లుల వసూలు

బడులకు అందించే విద్యుత్తు కేటగిరీ 7 కింద చార్జీలు వసూలు చేస్తున్నారు. దాని ప్రకారం యూనిట్‌కు రూ.7.80 పడుతుంది. ఆరు గదులున్న ప్రాథమిక పాఠశాలలకు నెలకు సుమారు రూ.600 పైబడి బిల్లు చెల్లించాల్సి వస్తోంది. అదే హైస్కూళ్లకు నెలకు రూ.1500 వరకు బిల్లులు వస్తున్నట్టు ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఈ లెక్కన ఏడాదికి సగటున రూ.18 వేల వరకు విద్యుత్ బిల్లులకు చెల్లించాల్సిన పరిస్థితి. పాఠశాలల నిర్వహణ కోసం విడుదలయ్యే బిల్లులో సగం కరెంట్ బిల్లులు చెల్లించడంతో ఇక పాఠశాలలోని ఇతర అవసరాలకు ఎటూ సరిపడడం లేదని వాపోతున్నారు. ప్రభుత్వం బడులకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తే స్కూళ్ల అభివృద్ధికి మరింత తోడ్పాటుగా ఉంటుందని పలువురు విద్యావేత్తలు సూచిస్తున్నారు.

ఉచిత విద్యుత్ ఇస్తే చాలా మేలు



ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్తు ఇస్తే ఎంతో మేలు జరుగుతుంది. ప్రభుత్వం పేద పిల్లలకు సైతం కార్పొరేట్ విద్య అందించాలని డిజిటలైజేషన్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. అందుకు ఉచిత విద్యుత్తు ఎంతో అవసరం ఉంటుంది. ప్రస్తుతం బడుల నిర్వహణకు విడుదలయ్యే నిధుల నుంచి సగం మేర కరెంట్ బిల్లులకే చెల్లించాల్సి వస్తోంది.

– మదన్ మోహన్, గెజిటెడ్ హెచ్‌ఎంల సంఘం జిల్లా అధ్యక్షుడు

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



ఎంపికైన బాలికల జట్టు

గజ్వేల్‌ : గజ్వేల్‌లో జనవరి 11 నుంచి 14 వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల కోసం గురువారం సిద్దిపేట జిల్లాకు చెందిన బాలబాలికల జట్లను ఎంపిక చేశారు. పట్టణంలోని ఐఓసీ(ఇంటిగ్రేటెడ్‌ ఆఫీస్‌ కాంప్లెక్స్‌) మైదానంలో ఈ ఎంపిక నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 150 మంది బాలురు, మరో 60 మంది బాలికలు ఇందులో పాల్గొనగా అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారిని జట్లలోకి ఎంపిక చేశారు. ఈ విషయాన్ని సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్‌ అధ్యక్షుడు సంతోష్‌, ప్రధాన కార్యదర్శి శివకుమార్‌ తెలిపారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్‌ మహిళా విభాగం అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, సలహాదారు దేశబోయిని నర్సింలు, జిల్లా కోశాధికారి సత్యం, ఉపాధ్యక్షుడు రాజు, సంయుక్త కార్యదర్శులు మహేశ్‌, నరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను గుర్తించాలి

ఎన్‌ఐటీ రూర్కెలా ప్రొఫెసర్‌ సింగం జయంతు



మాట్లాడుతున్న సింగం జయంతు

పటాన్‌చెరుటౌన్‌: మన చుట్టూ ఉన్న సమాజంలోని సమస్యలను గుర్తించి, వాటికి పరిష్కారం చూపడం విజయానికి తొలిమెట్టుగా ఎన్‌ఐటీ రూర్కెలాలోని మైనింగ్‌ ఇంజనీరింగ్‌ విభాగం ప్రొఫెసర్‌ సింగం జయంతు అభివర్ణించారు. గీతం స్కూల్‌ ఆఫ్‌ టెక్నాలజీలోని సివిల్‌ ఇంజనీరింగ్‌ విభాగం ఆధ్వర్యంలో 'వాలుల స్థిరత్వంపై జియోటెక్నికల్‌ పరిశోధన' అనే అంశంపై గురువారం ఆయన అతిథ్య ఉపన్యాసం చేశారు. ఏదైనా సమస్యను పరిష్కరించాలనే ఉమ్మడి లక్ష్యంతో, దానిని ఓ ప్రాజెక్టుగా విద్యార్థులు చేపట్టి, వినూత్న పరిష్కారాలతో అద్భుత ఫలితాలను సాధించవచ్చని సూచించారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, విద్యార్థులు, పరిశ్రమ నిపుణులు తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ రిపబ్లిక్‌ పరేడ్‌కు 'అందె మ్యూజిక్‌ అకాడమీ' ఎంపిక



అందె భాస్కర్‌

మిరుదొడ్డి(దుబ్బాక): జనవరి 26న ఢిల్లీలో జరిగే రిపబ్లిక్‌ పరేడ్‌కు మండల పరిధిలోని అందె గ్రామానికి చెందిన అందె మ్యూజిక్‌ అకాడమీ ఎంపికైంది. ఈ మేరకు భారత సంగీత నాటక అకాడమీ, మినిస్ట్రీ ఆఫ్‌ కల్చర్‌ గవర్నమెంట్‌ ఆఫ్‌ ఇండియా నుంచి ఆహ్వానం లభించినట్లు అకాడమీ డైరెక్టర్‌ అందె భాస్కర్‌ గురువారం తెలిపారు. డప్పు మహిళా బృందానికి అవకాశం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డా. మామిడి హరికృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.

చేతికందే సమయం.. ఆగమాగం

ఆరుగాలం కష్టపడి పంటలు సాగు చేస్తుకున్న రైతులను ఈ ఏడాది చివరి క్షణంలో వర్షాలు ఆగమాగం చేశాయి. పంటలు చేతికందే సమయంలో మిఛాంగ్‌ తుపాన్‌ ప్రభావంతో రైతులు నష్టాలను చవిచూడాల్సి వచ్చింది. గతంకంటే ఈసారి సాగు గణనీయంగా పెరిగింది. మొదట్లో ఆశించిన మేర వర్షాలు కురిశాయి. జిల్లాలోని రిజర్వాయర్లు నీటిమట్టాలతో నిండిపోయాయి. ఉచిత విద్యుత్‌ సరఫరాతో సాగు నీటి కష్టాలు తీరి, పంటలు విరివిగా పండించారు. రైతుబంధు, రైతుబీమా వంటివి ఆశలు కలిగించాయి. కానీ చివరికి తుపాన్‌ ప్రభావంతో పంటలు పాడై నష్టాన్ని మిగిల్చాయి.

– ప్రశాంత్‌నగర్‌(సిద్దిపేట)



తుపాన్‌ దాటికి తడుస్తున్న వరి ధాన్యంపై టార్పాలిన్లు కప్పిన రైతులు

- చివరి క్షణంలో మిఛాంగ్‌ తుపాన్‌ దెబ్బ
- 51,261 ఎకరాల్లో రూ.51 కోట్ల పంట నష్టం
- పత్తి ధర ఢమాల్‌, నిండా మునిగిన వరి రైతులు
- గత ఏడాదితో పోలిస్తే పెరిగిన సాగు
- మొదట్లో అనుకున్న స్థాయిలో వర్షాలు
- రైతుబంధు, రైతు బీమా కాస్త ఊరట

సిద్దిపేట జిల్లాలో వానాకాలం సాగులో భాగంగా రైతులు 5,27,906 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేశారు. ఇందులో అత్యధికంగా వరి 3,66,169 ఎకరాల్లో సాగు చేశారు. ఉద్యాన పంటలు అయిన ఆయిల్‌పామ్‌, మల్బరీ, మామిడి, సపోట, బొప్పాయి, టమాట పంటలతోపాటుగా ఇతర నూతన పంటల సాగుకు రైతులు మక్కువ చూపారు.

వణికించిన తుపాన్‌..

జిల్లాలో వానాకాలం పంటలు చేతికందే సమయంలో మిఛాంగ్‌ తుపాన్‌ రైతులను బెంబేలెత్తించింది. వరి పంటను కోసి ఆరబెట్టిన ధాన్యం, అదే విధంగా కోత దశలో ఉన్న వరి పంట అధికంగా దెబ్బతింది. 5 రోజులపాటుగా మిఛాంగ్‌ తుపాన్‌ జిల్లాను వణికించింది. దీంతో జిల్లాలో 65,056 మంది రైతులకు చెందిన 51,261 ఎకరాల్లో రూ.51 కోట్ల మేర వరితో పాటుగా ఇతర పంటలు దెబ్బతిన్నాయి.

పత్తి రైతు చిత్తు..



జిల్లాలో పత్తి వేసిన రైతులు ధరతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. 1.08లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయగా సేకరించే దశలో ధరలు పడిపోయాయి. 2022లో గరిష్ట ధర రూ.9 వేల వరకు పలికింది. 2023లో మాత్రం రూ.6500 మాత్రమే ఉంది. దీంతో పత్తి రైతులు ఒకింత అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 1.60 లక్షల క్వింటాళ్ల పత్తిని ప్రభుత్వ, ప్రైవేట్‌ వ్యాపారులు ఖరీదు చేశారు.

టాప్‌ గేర్‌లో టమాట

జిల్లాలో టమాట సాగు చేసిన రైతులకు ఈ సంవత్సరం ఆశించిన ధర కంటే అధిక ధర రావడంతో టాప్‌ గేర్‌లోకి దూసుకెళ్లారు. జిల్లాలో 700 ఎకరాల్లో టమాటను రైతులు సాగు చేశారు. దీంతో ఎకరకు 18 టన్నుల దిగుబడి వచ్చింది. రెండు నెలలపాటు టమాట ధర రూ.100కు పైగా ఉండడంతో రైతులు తమ కష్టానికి మించి ప్రతిఫలం అందుకున్నారు.

ఆదుకుంటున్న రైతుబంధు, రైతుబీమా

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతుబంధు పథకం సత్ఫలితాలనిచ్చింది. వానాకాలం రైతుబంధుకు గాను 3,19,852 మంది రైతులకు రూ.313.23 కోట్లు అందాయి. కానీ యాసంగి రైతుబంధు ఇప్పటి వరకు 97,777 మంది రైతులకు రూ.20.30 కోట్లు మాత్రమే రైతుల ఖాతాల్లో జమ అయ్యాయి. జిల్లాలో 361 మంది రైతులు మరణించగా వారి కుటుంబీకులకు రూ.18.05 కోట్ల రైతు బీమాను రాష్ట్ర ప్రభుత్వం అందించింది.

కొనుగోళ్లు అంతంతే..

జిల్లాలో 417 కొనుగోళ్ల కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు 3,62,193 క్వింటాళ్ల వరి ధాన్యం మాత్రమే సేకరించారు. మిగితా ధాన్యాన్ని రైతులు ప్రైవేట్‌ వ్యాపారులకు విక్రయించారు. గతేడాది 3,99,314 క్వింటాళ్ల వరి ధాన్యంను కొనుగోలు కేంద్రాల ద్వారా ఖరీదు చేశారు. అంటే గతేడాది ఈ సంవత్సరం ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యం తగ్గింది.



రివైండ్‌ 2023



ఆశించిన మేర వర్షాలు..

జిల్లాలో 2021-22తో పోలిస్తే, 2022-23 సంవత్సరంలో వర్షాలు సమృద్ధిగా కురిశాయి. దీనికి తోడుగా జిల్లాలోని రంగనాయకసాగర్‌, మల్లన్న సాగర్‌, కొండపోచమ్మసాగర్‌, గౌరవెల్లి రిజర్వాయర్‌, తపాస్‌పల్లి, శనిగరం రిజర్వాయర్‌లు నీటితో నిండిపోయాయి. 2022-23 సంవత్సరంకుగాను జిల్లాలో 1278.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది. జిల్లా సాధారణ వర్షపాతం 784.2 మిల్లీమీటర్లు కాగా అదనంగా 63 శాతం వర్షపాతం నమోదు అయ్యింది. దీంతో జిల్లాలోని మోయతుమ్మెద, హల్దీ వాగు, కూడవెల్లి వాగులు పరిమితికి మించి ప్రవహించాయి.



వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న పంట

ఒడిదుడుకుల వ్యవసాయం

ఈ ఏడాది జిల్లా రైతులకు కాలం కలిసిరాలేదు. పంటచేతి కందే సమయంలో అతివృష్టితో వేలాది ఎకరాల్లో పంటలు నష్టపోయారు. భారీ వర్షాలు కురవడంతోపాటు మిఛాంగ్‌ తుపాన్‌ దెబ్బకు రైతులు వణికిపోయారు. అలాగే, రబీ సీజన్‌లో పంట నష్టపోయిన వారికి ఇంతవరకు పరిహారం అందలేదు. పూర్తి స్థాయిలో రుణమాఫీ కూడా కాలేదు. ఈసారి ఇంకా రైతుబంధు రాలేదు. ఎన్నో ఒడిదుడుకుల మధ్య రైతులు వివిధ పంటలు సాగు చేసి ఏడాది పొడవునా అవస్థలు పడుతూనే వచ్చారు.

– మెదక్‌

- ఏడాది పొడవునా వెంటాడిన అతివృష్టి
- వేలాది ఎకరాల్లో పంటలు ధ్వంసం
- పరిహారం ఇవ్వకుండా చేతులెత్తేసిన గత ప్రభుత్వం
- రుణమాఫీ, రైతుబంధు రాక అవస్థలు
- కష్టాల కడలిలో జిల్లా రైతులు

జిల్లాలో ఈ సంవత్సరం రబీ సీజన్‌లో 3.45 లక్షల ఎకరాల్లో వరితోపాటు వివిధ రకాల పంటలను సాగు చేశారు. తీరా పంట చేతికందే ఏప్రిల్‌ నెలలో ఈదురుగాలులతో కూడిన అకాల వర్షాలు కురిశాయి. జిల్లా వ్యాప్తంగా 12, 265 ఎకరాల్లో వరితోపాటు ఇతర పంటలు దెబ్బతిన్నాయి. అప్పట్లో సీఎం కేసీఆర్‌ రైతులను ఆదుకుంటానని, ఎకరాకు రూ.10 వేల చొప్పున నష్టపరిహారం ఇస్తానని రైతులకు హామీ ఇచ్చారు. జిల్లాలో రూ.12 కోట్ల 25 లక్షల 86 వేల పంట నష్టం వాటిల్లిందని గుర్తించారు. ఈ మొత్తాన్ని బాధిత రైతులకు పరిహారం రూపంలో ఇవ్వాల్సి ఉంది. కానీ కేవలం రూ. 8.86 లక్షలు మాత్రమే ఇచ్చారు.

కాని రుణమాఫీ..

జిల్లాలో రూ.లక్షలోపు రుణాలకు 1,50,514 మంది రైతులు రుణమాఫీకి అర్హులుగా గుర్తించారు. వీరికి రూ.912 కోట్లు మాఫీ కావాల్సి ఉండగా ఇప్పటి వరకు 73,026 మంది రైతులకు రూ.366 కోట్లు మాత్రమే మాఫీ అయ్యింది. ఇంకా 77,488 మంది రైతులకు గాను రూ.546 కోట్లు మాఫీ కావాల్సి ఉంది.ఈ రుణమాఫీ కోసం నిత్యం బ్యాంకుల చుట్టూ రైతులు ప్రదక్షిణలు చేస్తున్నారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఏకకాలంలో రూ. 2 లక్షల వరకు రుణమాఫీ చేస్తానని చెప్పారు. దీనికి గాను రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

అందని రైతుబంధు..

ప్రభుత్వం మారినప్పటికీ ఈ యాసంగి పంట సాగు కోసం రైతు బంధు ఇంకా అందలేదు. జిల్లా వ్యాప్తంగా 3,06,437 ఎకరాల్లో వరితోపాటు ఇతర పంటలను 2,80,949 మంది రైతులు సాగు చేశారు. వీరికి పాత పద్ధతిన ఎకరాకు రూ.5 వేల చొప్పున రూ.200 కోట్ల 71 లక్షల 74 వేలు రైతుల ఖాతాల్లో జమకావాల్సి ఉంది. ఇప్పటి వరకు కేవలం ఎకరం లోపు ఉన్న 1,11,241 మంది రైతులకు కేవలం రూ. 21 కోట్ల 9 లక్షల 81 వేలు జమ అయినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఇంకా 90 శాతం నిధులు రావాల్సి ఉంది. ఇప్పటికే సగం మేర వరినాట్లు పూర్తి అయ్యాయి. అన్నదాతలు ప్రైవేట్‌ వ్యాపారులను ఆశ్రయిస్తూ పెట్టుబడికి అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

తగ్గిన ఆయిల్‌ పామ్‌ సాగు

జిల్లాలో ఎప్పుడు ఒకే రకమైన వరి పంటనే సాగు చేస్తున్నారని, దీని వల్ల భూసారం దెబ్బతింటుందని, వరికి బదులు అధిక లాభాలు గడించే ఆయిల్‌ పామ్‌ సాగుకు ప్రాధాన్యత ఇచ్చారు. గత ప్రభుత్వం ఈ ఏడాది జిల్లాకు 50 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్‌ సాగుకు మంజూరు ఇచ్చింది. ఇందు కోసం సబ్సిడీపై డ్రిప్‌ పరికరాలు, ఆయిల్‌ పామ్‌ మొక్కలకు ఎకరాకు రూ. 50 వేలు సబ్సిడీ ప్రకటించారు. 5 వేల ఎకరాలకు తగ్గకుండా ఆయిల్‌ పామ్‌ సాగు చేసేందుకు అధికారులు నిర్ణయించారు. కానీ కేవలం వెయ్యి ఎకరాలు మాత్రమే సాగు చేసేందుకు రైతులు ముందుకొచ్చినట్లు సంబంధిత ఉద్యానవనశాఖ అధికారులు పేర్కొన్నారు.



దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

భక్తులకు మెరుగైన సౌకర్యాలు

దేవాదాయ శాఖ కమిషనర్‌ అనిల్‌కుమార్‌

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి కల్యాణానికి, జాతరకు వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని దేవాదాయ శాఖ కమిషనర్‌ అనిల్‌ కుమార్‌ అన్నారు. గురువారం స్వామివారి కల్యాణ ఏర్పాట్లతోపాటు ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆలయ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ సత్యనారాయణరెడ్డి, ఎస్‌ఐ నాగరాజుతో కలిసి జాతర బ్రహ్మోత్సవాల్లో భద్రత, పార్కింగ్‌ తదితర విషయాలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులు 50 గదుల నిర్మాణం, త్రిశూలం ఢమరుకం, క్యూ కాంప్లెక్స్‌ పనులు వెంటనే పూర్తి చేయాలని ఆలయ ఈవో బాలాజీని ఆదేశించారు.



పోలీసులతో జాతర, బ్రహ్మోత్సవాలపై చర్చిస్తున్న అనిల్‌కుమార్‌

ఆలయంలో కరోనా వ్యాప్తికి చర్యలు చేపట్టాలని, భక్తులు మాస్క్‌ ధరించి ఆలయ అధికారులకు సహకరించాలన్నారు. జాతర బ్రహ్మోత్సవాలపై సమీక్ష సమావేశం జిల్లా అధికారులు త్వరలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో బాలాజీ, ఏఈవో అంజయ్య, సూపరింటెండెంట్‌ శేఖర్‌, ఆలయ ప్రధానార్చకులు మహదేవుని మల్లికార్జున్‌, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని యువ రైతు మృతి



కమల్‌ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

- రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తుండగా ఘటన
- న్యాయం చేయాలని బంధువుల ఆందోళన



శేరి కమల్‌ (ఫైల్‌)

ఝరాసంగం(జహీరాబాద్‌): రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న యువ రైతును ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని తుమ్మన్‌ పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. తుమ్మన్‌ పల్లి గ్రామానికి చెందిన శేరి కమల్‌(28) వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే గురువారం ఉదయం పశువుల పేడను గ్రామ శివారులోని పెంటకుప్పలో వేసి నడుచుకుంటూ ఇంటికొస్తున్నాడు. ఇదే సమయంలో జహీరాబాద్‌ నుంచి కోడూర్‌ వైపు వెళ్తున్న జహీరాబాద్‌ డిపో బస్సు కమల్‌ను వెనుకాల నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. జహీరాబాద్‌ రూరల్‌ సీఐ వెంకటేష్‌, ఝరా సంగం ఎస్‌ఐ రాజేందర్‌ రెడ్డి, రాయికోడ్‌ ఎస్‌ఐ వెంకట్‌ రెడ్డి సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి కుటుంబానికి పరిహారం అందించి, న్యాయం చేయాలని డిమాండ్‌ చేస్తూ ఆందోళన చేశారు. పోలీసులు కలుగజేసుకొని మృతుడి కుటుంబానికి న్యాయం చేస్తామన్నారు. మృతుడి భార్యశేరి నేహ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు. మృతుడికి ఐదు నెలల బాలుడు ఉన్నారు. ప్రమాద విషయం తెలుసుకున్న జహీరాబాద్‌ ఎమ్మెల్యే మాణిక్‌రావు ప్రభుత్వాస్పత్రికి వెళ్లి కుటుంబ సభ్యులకు పరామర్శించారు. ఎమ్మెల్యేతో బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు వెంకటేశం ఉన్నారు.

అప్పుల బాధతో ఇద్దరు ఆత్మహత్య

వేర్వేరు ప్రాంతాల్లో అప్పుల బాధతో ఇద్దరు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. నిజాంపేట మండల పరిధిలోని తిప్పన్నగుల్ల గ్రామంలో వృద్ధుడు, కొల్చారం మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డారు.

మనోవేదనకు గురై..



మల్లయ్య(ఫైల్‌)

నిజాంపేట(మెదక్‌): ఉరి వేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం తెల్లవారు జామున మండల పరిధిలోని తిప్పన్నగుల్ల గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని తిప్పనగుల్ల గ్రామానికి చెందిన బెల్లం మల్లయ్య (53) వరి సాగు చేయగా దిగుబడి సరిగా రాలేదు. దీంతో అప్పుల పాలయ్యాడు. అలాగే, ఐదేళ్ల క్రితం నుంచి తనకు తమ పాలివారికి భూమి విషయంలో తగాదా నడుస్తోంది. దీంతో ప్రతిరోజూ మల్లయ్య చింతిస్తూ బాధపడుతుండేవాడని గ్రామస్తులు పేర్కొన్నారు. బుధవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిన మల్లయ్య తిప్పన్నగుల్ల-బచ్చురాజ్‌పల్లి రహదారి పక్కన చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

ఆర్థిక ఇబ్బందులతో..



యాదుల్‌ మృతదేహం

కొల్చారం(నర్సాపూర్‌): ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ తారా సింగ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దూదేకుల యాదుల్‌(34) వ్యవసాయం చేస్తూనే చికెన్‌ సెంటర్‌ను నడుపుతున్నాడు. వ్యవసాయం కోసం అప్పులు చేశాడు. పంట దిగుబడి రాకపోవడం, అప్పులు తీర్చేమార్గం లేక మానోవేదకు గురయ్యేవాడు. బుధవారం రాత్రి భోజనం చేసి పొలం వద్దకు వెళ్తానన్న వ్యక్తి ఉదయం వరకు తిరిగి రాలేదు. అనుమానం వచ్చి పొలం వద్దకు వెళ్లి చూడగా చెట్టుకు ఉరివేసుకొని కనిపించాడు. మృతుడి భార్య అస్మా బేగం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

తండ్రి చనిపోయిన నెల రోజులకే..

రోడ్డు ప్రమాదంలో కుమారుడు మృతి

రామాయంపేట(మెదక్‌): తండ్రి చనిపోయిన సరిగ్గా నెలరోజులకే కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని ప్రగతి ధర్మారం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ప్రగతి ధర్మారం గ్రామానికి చెందిన గుజ్జ గుర్గిల్‌ (55) నవంబర్‌ 28న గుండెపోటుతో మృతిచెందాడు. గుర్గిల్‌కు ఇద్దరు కుమారులతో పాటు కూతురు ఉంది. పాల వ్యాపారం చేస్తున్న చిన్న కుమారుడు గుజ్జ సురేశ్‌ (24) గురువారం బైక్‌పై రామాయంపేటవైపు వస్తున్నాడు. సుతారిపల్లి నుంచి నర్సంపల్లి వైపు బైక్‌పై వెళ్తున్న ఓ కానిస్టేబుల్‌ సురేశ్‌ బైక్‌ను వేగంగా ఢీకొట్టాడు. దీంతో రోడ్డుపై పడిపోయిన సురేశ్‌ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకొని ధర్మారం గ్రామస్తులు పెద్ద సంఖ్యలో ఘటనా స్థలికి చేరుకొని రోడ్డుపై బైఠాయించి రాస్తా రోకో చేపట్టారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్తులు డిమాండ్‌ చేశారు. పోలీసుల జోక్యంతో ఆందోళన విరమింపజేశారు. ఈ మేరకు ఎస్‌ఐ రంజిత్‌ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

రెండు బైక్‌లను ఢీకొట్టిన లారీ

మహిళ మృతి, మరో ముగ్గురికి తీవ్ర గాయాలు

చేగుంట(తూప్రాన్‌): రెండు బైక్‌లను లారీ ఢీకొట్టడంతో మహిళ మృతిచెందగా, మరో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం చేగుంట శివారులోని మెదక్‌ రోడ్డులో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పేట మండలం చందంపేట గ్రామానికి చెందిన సంజయ్‌గౌడ్‌ ఆర్‌ఎంపీ డాక్టర్‌గా పని చేస్తున్నాడు. చేగుంటలో మందులు కొనుగోలు చేసి పేట వైపు స్కూటీపై దేవబ్రత్‌దేవ్‌ను ఎక్కించుకొని వస్తున్నాడు. ఈ క్రమంలో మెదక్‌ నుంచి చేగుంట వైపుకు వస్తున్న లారీ పొలంపల్లి చెరువు వద్ద సంజయ్‌ స్కూటీని ఢీకొట్టింది. కొంత దూరం ముందుకు వెళ్లిన లారీ మోపెడ్‌పై చేగుంట బంధువుల అంత్యక్రియలకు వెళ్తున్న బూదయ్య, వెంకటమ్మలను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పేట మండలం చందాపూర్‌కు చెందిన వెంకటమ్మ(50) అక్కడికక్కడే మృతి చెందింది. సంజయ్‌గౌడ్‌, బీహార్‌కు చెందిన దేవబ్రత్‌దేవ్‌, చందాపూర్‌కు చెందిన బూదయ్యకు తీవ్ర గాయాలు అయ్యాయి. లారీ మరికొంత ముందుకు వెళ్లి ఓ పరిశ్రమ కార్మికుల బస్సును ఢీకొట్టి ఆగిపోయింది. ప్రమాదాలకు కారణమైన లారీ డ్రైవర్‌ను పోలీసులు పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి వెంకటమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ హరీశ్‌ తెలిపారు.



వెంకటమ్మ మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

చేపల వేటకు వెళ్లి.. శవమై తేలి

గజ్వేల్‌రూరల్‌: చెరువులో చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన ఘటన గజ్వేల్‌ మున్సిపాలిటీ పరిధిలోని సంగుపల్లిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని హవేలి కాలనీకి చెందిన మీర్‌ హర్షద్‌ అలీ (37)కి భార్య రేష్మ, ముగ్గురు కూతుర్లు, కొడుకు ఉన్నారు. ఎలక్ట్రీషియన్‌గా పని చేసే అతడు సంగుపల్లిలోని చెరువులో అప్పుడప్పుడు చేపలు పట్టేందుకు వెళ్తుంటాడు. పిల్లలకు సెలవులు రావడంతో ఈనెల 24న రేష్మ సిద్దిపేటలోని తన తల్లిగారింటికి పిల్లలతో వెళ్లింది. తిరిగి ఇంటికి చేరుకున్న రేష్మకు మీర్‌ హర్షద్‌ అలీ కనిపించలేదు. కుటుంబ సభ్యులతో కలిసి వెతుకుతుండగా గురువారం సంగుపల్లి చెరువులో శవమై కనిపించాడని, చెరువు వద్ద బైక్‌, సెల్‌ఫోన్‌ ఉన్నాయని స్థానికులు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న బాధిత కుటుంబీకులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెంది ఉండొచ్చని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.